నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: జనప్రియ, అల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియటర్ ఏరియా, అశ్విని హెయిర్ ఆయిల్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 25, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 40, గుండుబీన్స్ 28, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 21, చామగడ్డ 43, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 8, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వంగపల్లి శ్రీనివాస్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సోషియాలజీ విభాగం విద్యార్థి వంగపల్లి శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీనియర్ ప్రొఫెసర్ సునంద పాండే పర్యవేక్షణలో మత్స్యకారులపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా లభించింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల వాసి వంగపల్లి శ్రీనివాస్ తన పరిశోధనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రమ్యశ్రీకి డాక్టరేట్




ఉస్మానియా యూనివర్సిటీ: వర్క్ ఫ్రమ్ హోం పద్ధతిపై చేసిన పరిశోధనకు గాను మొగిలిచర్ల రమ్యశ్రీకి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. కామర్స్ విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.కృష్ణకుమార్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ప్రభుత్వ గురుకుల డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్న రమ్యశ్రీ తండ్రి వెంకటేశ్వర్లు ఓయూలో 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగం చేస్తుండగా కూతురు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి చివరకు డిగ్రీ లెక్చరర్‌గా స్థిరపడ్డారు.

ఉచిత వైద్య శిబిరం



రసూల్‌పురా: రసూల్‌పురా గన్‌బజార్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలు, అర్థోపెడిక్, కంటి పరీక్షలు, చేశారు. విశ్రాంత డీజీపీ ఎస్‌ఏ హుడా, లీఫార్మ మేనేజింగ్ డైరక్టర్ విఆర్. ఎన్. కర్రెడ్డి, సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ సిఎల్. వెంకటరావు, డా. రాజీవ్ అరబ్, పాల్గొన్నారు.

ప్యాచ్ వర్క్ పనులు చేయాలి



బౌద్ధనగర్: డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులు చేయాలని డివిజన్‌లోని రోడ్ నెంబర్ 6కు చెందిన స్థానికులు కోరుతున్నారు. రెండు నెలల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కోసం రోడ్డ తవ్వారని, పనులు పూర్తి అయిన తరువాత అధికారులు రోడ్డు వేయకుండా వెళ్లిపోయారన్నారు. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుకు తగిన ప్యాచ్ వర్క్ పనులు చేయాలని కోరుతున్నారు.

మద్యం మత్తులో మహిళ వీరంగం

వెంగళరావునగర్: మద్యం మత్తులో ఓ మహిళ వీరంగం సృష్టించింది. మధురానగర్ పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం రాత్రి మధురానగర్‌లో ఓ మహిళ మద్యం తాగి చరణ్ అనే వ్యక్తిని దుర్భాషలాడుతోంది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్ళగా వారిని సైతం ఆ మహిళ దూషించింది. దీంతో ఆమెను పీఎస్‌కు తరలించారు. పోలీసుస్టేషన్‌లో సైతం ఆమె సిబ్బందిని దూషించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండుటెండకు మాడిపోతున్నారు



ఆక్రమణలో బస్ షెల్టర్లు

ఎండలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

సనత్‌నగర్: మండుటెండల్లో ప్రయాణికులు మాడిపోతున్నారు. బస్ షెల్టర్లు ఉన్నా..లేనట్టే.. కొన్ని చోట్ల బస్సు షెల్టర్లు లేని పరిస్థితి ఉంటే.. కొన్ని చోట్ల ఉన్నా వ్యాపారాలకు నెలవుగా మారి ప్రయాణికుల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. దీంతో బస్సులు కోసం నిరీక్షించే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఒకవైపు ప్రయాణికుల సంక్షేమమే తమ లక్ష్యంగా ఆర్టీసీ ప్రకటనలు ఊదరగొడుతున్నా ఆచరణలో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందింది. సనత్‌నగర్ బస్టాండ్ నుంచి రోజుకు దాదాపు 80 వరకు బస్సులు నగరంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వేలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుస్తాయి. ఇదిలా ఉంటే బస్సుల కోసం వేచి ఉందామంటే బస్సు షెల్టర్లే కరువయ్యాయి. ముఖ్యంగా సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్, జెక్‌కాలనీ రిక్వెస్ట్ స్టాప్, ఎర్రగడ్డ చౌరస్తా, బల్కంపేట ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేక నడిరోడ్డు పైనేప్రయాణికులు నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతుండడంతో రోడ్లపై ప్రయాణికులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇక కొన్ని ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు ఉన్నా వ్యాపారాలకు కేంద్రంగా మారిపోయాయి. ముఖ్యంగా ఈఎస్‌ఐ (కూకట్‌పల్లి వైపు వెళ్ళే



బస్‌షెల్టర్ ఆక్రమణ ఇలా



ఈఎస్‌ఐ బస్టాపు వద్ద ఎండలో నిలబడి బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

బస్సులు ఆగే బస్టాపు), ఎర్రగడ్డ (ప్రాంతాల్లోని బస్‌షెల్టర్లు వ్యాపారాలతో ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్సు షెల్టర్లు కాస్తా నిరుపయోగంగా మారి ప్రయాణికులు నడిరోడ్డుపై వేచి ఉండాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల బస్సు షెల్టర్లు ఉన్నా బస్సులు ఆగని పరిస్థితి ఉంది. ముఖ్యంగా టీబీ ఆస్పత్రి, సనత్‌నగర్ హెటిరో డ్రగ్స్ వంటి బస్టాపుల్లో అన్ని బస్సులు ఆగడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రకటనల ఆదాయం పైనే దృష్టి..

ఎక్కడెక్కడ బస్ షెల్టర్ల నిర్మాణం జరపాలో గుర్తింపు ప్రక్రియ ఆర్టీసీ చేపట్టాల్సి ఉండగా వాటి నిర్మాణ బాధ్యత జీహెచ్‌ఎంసీ చూస్తోంది. అయితే చాలాచోట్ల బస్‌షెల్టర్లు ఉన్నా అవి కేవలం ప్రకటనలకు మాత్రమే ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోంది. ప్రయాణికుల ప్రయోజనాలను పక్కనబెట్టి కేవలం ఆదాయం కోసమే ప్రకటనల నిమిత్తం షెల్టర్ల నిర్మాణం జరపడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రయాణికుల నుంచి ప్రతిరోజూ లక్షలాది రూపాయల ఆదాయం ఆర్టీసీకి అందుతున్నా షెల్టర్ల ఏర్పాటులో అలక్ష్యం తగదని, దీనిపై ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి బస్సు షెల్టర్లను ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న బస్సు షెల్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సనత్‌నగర్ హెటిరో ముందు ఇలా..

సౌకర్యాలుంటేనే చదువుపై శ్రద్ధ చూపిస్తారు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పాఠశాలలో సరైన సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపిస్తారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం సనత్‌నగర్‌లోని నెహ్రూ పార్కు సమీపంలో గల రౌండ్‌టేబుల్ స్కూల్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఈ స్కూల్‌లో సుమారు 600 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్యకు తగినట్లు తరగతి గదులు లేవని ఎమ్మెల్యేకు స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు వివరించారు. సరిపడా తరగతి గదులు లేని కారణంగా చెట్ల కింద, షెడ్ల కింద విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మేడ్చెల్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. రూ.40 లక్షల రూపాయలతో ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చెల్ కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలి: ఎమ్మెల్యే..

సనత్‌నగర్‌లోని ఎస్సార్టీకాలనీలో అన్ని సౌకర్యాలతో కూడిన నూతన హాస్పటల్ నిర్మించాల్సిన



పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అవసరం ఉన్నదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం సనత్‌నగర్‌లో పర్యటించిన సందర్భంగా ఎస్సార్టీలో ఉన్న డిస్పెన్సరీకి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకు తగిన విధంగా సౌకర్యాలు కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి ఫోన్ చేసి మాట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, ఎంఈఓ హరిచంద్ర, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మేనిఫెస్టో ఆవిష్కరణ

పంజగుట్ట: పట్టభద్రుల ఎన్నికల్లో గెలవగానే పాత పెన్షన్ పథకం పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి తలకోల పురుషోత్తం రెడ్డి అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీచర్స్ 2030 మేనిఫెస్టోను వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ మాజీ కార్యదర్శి డాక్టర్ బి.విజయ్‌కుమార్, విద్యావేత్త డాక్టర్ ఈ.రాజిరెడ్డి, ప్రొఫెసర్ రేఖారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో మొదటిసారి ఒక స్వతంత్ర అభ్యర్థి విస్తృతమైన విద్యా పరిపాలనా ప్రణాళిక రూపొందించబడిందని తెలిపారు. కొత్త పెన్షన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయించి పాత పెన్షన్ విధానం అమలు చేసేలా కృషి చేస్తానని, పీఆర్సీ ప్రకారం 53 శాతం ఫిట్‌మెంట్, డీఏ చెల్లింపు, విద్యాలయాల్లో మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, స్మార్ట్ ల్యాబ్‌లు, లైబ్రరీలు ఏర్పాటు చేస్తానన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం

రసూల్‌పురా: శివరాత్రి పర్వదినం మహోత్సవాలను పురస్కరించుకుని సదర్‌బజార్ బొల్లారం మహంకాళి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి యేడు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వృషభలగ్నంలో శివపార్వతుల కల్యాణం జరపడం ఆనవాయితీ అని అన్నారు.

ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు తగిన వాటా ఇవ్వాలి

రసూల్‌పురా: ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు తగిన వాటా ఇవ్వడంతో పాటు అన్ని కులాల వారికి సమన్యాయం జరిగేలా చట్టం తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ డ్రీమ్ ల్యాండ్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఎస్సీ వర్గీకరణలో శాస్త్రీయత, హేతుబద్ధత పూర్తిగా లోపించిందన్నారు. అందువల్లనే అన్ని కులాల్లో అసంతృప్తి నెలకొని ఉందని కనుక అందరికీ న్యాయం జరిగేలా ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను మాలలు మినహా ఎస్సీలలో మిగతా 58 కులాలు కోరుతున్నాయని అన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ అధ్యక్షత వహించగా మాజీ పార్లమెంటు సభ్యులు వెంకటేష్ నేత, బీసీ నేత డా. పృథ్వీరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ

ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్: ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కుర్మబస్తీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య పరీక్ష శిబిరానికి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ పేదలు అధికంగా నివసించే బస్తీలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అరుణ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల వేతనం పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నెలకు రూ.50 వేల వేతనం పెంచాలని వర్సిటీల పార్ట్‌టైం అధ్యాపకులు విద్యాకమిషన్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. సోమవారం తెలంగాణ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని కార్యాలయంలో చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ప్రొ.పీఎల్ విశ్వేశ్వర్ రావు, డా.చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డిని కలిసి సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పర్మనెంట్ నియామకాల్లో వెటేజీమార్కులు వేయాలని కోరారు.



ఆకునూరి మురళికి వినతి పత్రం అందచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు

చెట్లు కొట్టేస్తున్న యూబీడీ సిబ్బందిపై ఫిర్యాదు

బంజారాహిల్స్: మొక్కలు నాటి చెట్లు పెంచి పచ్చదనాన్ని, పర్యావరణాన్ని కాపాడాల్సిన జీహెచ్‌ఎంసీ అర్బన్ బయో డైవర్సిటీ (యూబీడీ) సిబ్బంది అనుమతులు లేకుండా అడ్డదారుల్లో యజమానులతో కుమ్మక్కై చెట్లు కొట్టేస్తుండడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని జహీరానగర్ చౌరస్తాలో గోల్కొండ ఎంపోరియం సమీపంలో ఓ ఇంటికి అడ్డుగా ఉన్నాయని మూడు చెట్లను కొట్టేశారు. ఈ వ్యవహారంపై సోమవారం జీహెచ్‌ఎంసీ యూబీడీ విభాగం అధికారిణి సుభద్రాదేవికి ఫిర్యాదులు అందాయి. జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 యూబీడీ విభాగానికి చెందిన సిబ్బంది ఈ చెట్లను కొట్టేయించారని ఆమెకు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం ఒక చెట్టు కొట్టేయాలంటే అటవీ శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. ఎక్కడైనా చెట్టు కొట్టేస్తుంటే అటవీ శాఖ అధికారులు అక్కడికి వెళ్లి ఆపి వారిపై కేసులు కూడా నమోదు చేయాలి. కానీ జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 పరిధిలో అటవీ శాఖ అధికారులు కూడా యజమానులతో కుమ్మక్కై చెట్లు కొట్టేసినా చర్యలు తీసుకోకుండా జారుకుంటున్నారు. ఇటీవల కాలంలో చాలా చోట్లకు అటవీ శాఖకు చెందిన సిబ్బంది వెళ్లి బేరసారాలు కుదుర్చుకున్న సంఘటనలు కూడా విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు అందాయి. ఒక వైపు యూబీడీ విభాగం నిర్లక్ష్యం, ఇంకోవైపు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నిర్వాకం వల్ల భారీ వృక్షాలు నేలమట్టమవుతున్నాయి. జీహెచ్‌ఎంసీ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, విజిలెన్స్ విభాగాలు నిఘా పెట్టకపోవడంతో స్థానికంగా మామూళ్లు దండుకుంటూ చెట్లు కొట్టేసేందుకు అడ్డదారుల్లో అనుమతులు ఇస్తున్నట్లుగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



దుకాణానికి అడ్డుగా ఉందని కొట్టేసిన చెట్టు

ఎమ్మెల్యే మాగంటికి తలసాని పరామర్శ

సనత్‌నగర్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

పరీక్ష ఫీజులు తగ్గించాలంటూ ర్యాలీ



ఓయూలో ఏబీవీపీ ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ, పీజీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. సోమవారం చలో ఉస్మానియా యూనివర్సిటీ పిలుపులో భాగంగా ఆర్ట్స్ కాలేజీ నుంచి ఓయూ పాలనా భవనం వరకు పెంచిన పరీక్షల ఫీజులను తగ్గించాలని నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఏబీవీపీ నాయకులు రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డికి ఫీజులు తగ్గించాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పృథ్వితేజ, జాన్సీ, అలివేలి రాజు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



చిలకలగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకున్న ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన మేరకు.. చిలకలగూడ రైల్వేక్వార్టర్స్ వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు ఆదివారం గస్తీపోలీసులకు సమాచారం అందింది. ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

లాలాగూడ రైల్వే ఆస్పత్రి సమీపంలో..



మృతుడు

అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ గంగాధర్ తెలిపిన మేరకు.. లాలాగూడ రైల్వే ఆస్పత్రి సమీపంలోని ఫుట్‌పాత్ పై ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో సుమారు 60-65 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు లాలాగూడ పోలీసులకు సమాచారం అందజేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

బెదిరించి నగలు, నగదు దోపిడీ

వెంగళరావునగర్: ఎన్‌జీఓ నిర్వహిస్తున్న వ్యక్తిని బెదిరించి నగలు, నగదు దోచుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..గాజులరామారం ప్రాంతానికి చెందిన ఎస్. రాజశ్రీకర్‌రెడ్డి తనకు చెందిన ఇంటిని రూ.39 లక్షలకు విక్రయించాడు. విషయం తెలుసుకున్న మణికుమార్, త్యాగరాజు, అగస్టీన్, కిరణ్‌కుమార్, సందీప్, రాజేంద్ర మరో ఇద్దరు మహిళలు గత ఏడాది రహమత్‌నగర్‌లోని వారి ఇంటికి పిలిచారు. తెలిసిన వ్యక్తులు అయినందున ఇంటికి వెళ్ళగా తమకు నగలు, నగదు కావాలని అడిగారు. ఒప్పుకోకపోవడంతో కట్టేసి కొట్టి ఫ్యాన్‌కు ఉరేసి చంపడానికి ప్రయత్నించారు. ఒక మహిళ తనను శారీరకంగా కలవాలని ఒత్తిడి తెచ్చింది. రాజశేఖర్ ఒప్పుకోకపోవడంతో లైంగిక దాడికేసు పెడతానని బెదిరించింది. అనేకమార్లు బెదిరింపులకు గురిచేసి రూ.12 లక్షల నగదు, 33 తులాల బంగారాన్ని తీసుకున్నారు. వాటిని తిరిగి ఇవ్వకపోగా తనపై తప్పుడు కేసు పెడతానని బెదిరిస్తున్నారు. బాధితుడు తనకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

లాలాపేట: తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం తార్నాకలో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులు డా. ఎన్. హన్మంతరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో చర్చించిన రిటైర్డు ఉద్యోగల సమస్యలపై సర్వసభ్య సమావేశం ఓ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అందజేయాలనీ నిర్ణయించినట్లు హన్మంతరెడ్డి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత డెయిరీ ఉద్యోగుల పట్ల మానవతా దృక్పదంతో ఆలోచించాలనీ కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. దశరథ్, శివాజీ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల ఫొటోలు యాప్‌లో నమోదు

బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఫొటోలను పోషణ్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి చిన్నారి వివరాలను ప్రత్యేకంగా కేటాయించిన యాప్‌లో నమోదు చేస్తూ పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధిలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఫొటోలను క్యాప్చర్ చేస్తూ ఈ యాప్‌లో అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంతమంది పిల్లలు వస్తున్నారు, రోజు హాజరవుతున్నారా? లేదా, వారికి పోషకాహారం అందిస్తున్నారా లేదా తదితర వివరాలన్నీ ప్రభుత్వానికి తెలిసేవిధంగా ఈ నమోదు కార్యక్రమం జరుగుతుంది.

ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు

శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు





మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమైన ముక్కంటి, సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం

సనత్‌నగర్: మహాశివరాత్రి పర్వదినం (బుధవారం) సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు అందంగా ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుద్దీపాలు, పూలదండల అలంకరణతో శోభయామానంగా వెలుగొందుతున్నాయి. బుధవారం వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రాత్రి జాగరణ చేసే భక్తుల కోసం పలు ఆలయాల్లో భజనలు, గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. భక్తులు భారీగా తరలిరానుండడం దృష్ట్యా ఇప్పటికే సౌకర్యాలు కల్పించారు. ఎండలు తీవ్రంగా ఉంటున్న నేపథ్యంలో భక్తుల కోసం పలు ఆలయాల ముందు పందిళ్లు వేశారు.

ప్రత్యేక పూజలు..

సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రుద్రాభిషేకములు, సాయంత్రం శివపార్వతుల కల్యాణ మహోత్సవం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, భక్తి సంగీత కార్యక్రమాలు (జాగరణ), మహాహారతి కార్యక్రమాలు ఉంటాయి.

- అమీర్‌పేట్ శ్రీహనుమాన్ దేవస్థానం శ్రీరాజరాజేశ్వర స్వామి వారి మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా తెల్లవారుజాము 4.30 నుంచే సర్వదర్శనం, అభిషేకాలు మొదలవుతాయని ఆలయ అధికారులు తెలిపారు.
- బల్కంపేట్ వీరహనుమాన్ షిర్డిసాయిబాబా దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఉదయం 5.30 గంటల ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరగనున్నాయి.
- బేగంపేట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించారు.